
సాక్షి రంగారెడ్డి

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ప్రకృతి వనం దగ్ధం

మాడ్గుల మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పల్లె ప్రకృతి వనం దగ్ధమైంది. 8లో▸

ప్రెస్‌క్లబ్ డైరీ ఆవిష్కరణ

లక్డీకాపూల్: శాంతిభద్రతల పరిరక్షణలో మీడియా పాత్ర కీలకమని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ రూపొందించిన 2023 నూతన డైరీని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాలనాయుడు, సంయుక్త కార్యదర్శులు చిలుకూరి హరిప్రసాద్, రమేష్ వైట్ల, కోశాధికారి రాజేష్, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఊరట

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రతి యాత్రికుడికి రూ.50 నుంచి 80 వేలు ఆదా అయ్యేలా సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. యాత్రికులు సొంత ఖర్చులపై హజ్‌కు వెళ్లేలా మరింత వెసులుబాటు కల్పించింది. ఎక్కడి నుంచైనా గమ్యస్థానానికి చేరుకునేలా అవకాశమిచ్చింది. ఈ మేరకు కొత్త హజ్ పాలసీని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

న్యూస్‌రీల్

13న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడలోగల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13న (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంఎస్‌డీఈ, డీఈఅండ్‌టీ హైదరాబాద్ వారి ఉత్తర్వులను అనుసరించి వివిధ పరిశ్రమలతో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలతో అప్రెంటీస్‌షిప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98492 44030 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.8.17 లక్షలు



కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో, దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం లెక్కించారు. మొత్తం 41 రోజులకు గాను భక్తులు కానుకల రూ పేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ.8,17,215 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, నాయకులు భాస్కర్ నాయక్, అరుణ్‌కుమార్, చంద్రయ్య, యాదగిరి, దేవేందర్, భోడియా, రమాదేవి, కృష్ణ ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపించండి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మాడ్గుల: గ్రామాల్లో మురికి నిల్వ ఉండకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శులకు సూచించారు. మండలంలోని మాడ్గుల, బ్రాహ్మణపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మాడ్గులలో కోలుకాలువ వద్ద మురికి నీరు నిలిచిన ప్రదేశాన్ని పరిశీలించారు. మురికి నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, డంపింగ్‌యార్డు, శ్మశానవాటికలను పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాలను సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన వెంట సర్పంచ్‌లు అంబ్ల జంగయ్యగౌడ్, పులికంటి లక్ష్మయ్య, ఉపసర్పంచ్ మిద్దె రాములు, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీడీఓ రాఘవులు, ఎంపీఓ వెజన్న, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి



కోటి సంతకాల సేకరణ

కేశంపేట: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ సాధన కోసం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా లింగం మాట్లాడుతూ.. దేశంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీ జనాభా లెక్కలు తీయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల వైఖరితో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. బీసీలపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కపట ప్రేమ ఒలకబోస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తట్టెపల్లి రాములు, దొడ్డి శ్రీనివాస్, భామయ్య, నరేష్, రాధాకృష్ణ, బాల్‌రాజ్, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.



రేస్‌ను తిలకిస్తున్న సందర్శకులు





ఇ రేస్..ఇక జోష్

ఫార్ములా-ఇ రేసింగ్‌కు నగరం సిద్ధం

- దేశంలోనే తొలిసారి జరుగుతున్న ఈవెంట్
- సర్క్యూట్ వద్ద సెలబ్రిటీల సందడి

హుస్సేన్ సాగర్ తీరం ఈ వారాంతం నగర అభిమానులకు కొత్త వినోదాన్ని అందించనుంది. ప్రతీ వారం అలా నెక్లెస్ రోడ్‌లో విహారానికి వచ్చేవారి కోసం కాకుండా క్రీడాభిమానుల కోసం ఈ రెండో శనివారం ప్రత్యేకంగా అంకితం కానుంది. దేశంలోనే తొలిసారి నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఫార్ములా-ఇ రేసింగ్‌లో ఎలక్ట్రిక్ కార్లు రయ్ అంటూ దూసుకుపోవడాన్ని ఆస్వాదించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. శుక్రవారం కార్లతో కాస్త సాధన చేసిన డ్రైవర్లు అసలు పోరులో సత్తా చాటనున్నారు. రేస్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చే సినిమా తారలు, ఇతర సెలబ్రిటీలతో ఐమ్యాక్స్ పరిసరాలన్నీ సందడితో నిండిపోనున్నాయి.

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర అభిమానులకు వారం రోజుల పాటు ట్రాఫిక్ సమస్యలు ఇబ్బంది కలిగించవచ్చు గాక.. విపరీతమైన జామ్‌లతో వారంతా అసహనం ప్రదర్శించవచ్చు గాక.. కానీ ఒక వరల్డ్ ఈవెంట్ మన నగరంలో జరుగుతోందంటే సహజంగానే ఉండే ఆసక్తి ఆ వైపు లాక్కెళ్తుంది. ఇప్పుడు ఫార్ములా-ఇ కూడా అలాగే అందరినీ ఆకర్షిస్తోంది. గంటకు దాదాపు 320 కిలోమీటర్ల వేగంతో రయ్యిరయ్యిమంటూ దూసుకుపోతూ ఫుల్ మీల్స్ వినోదం అందించడం ఖాయం. ఎన్నో ఏళ్లుగా మోటార్ రేసింగ్‌లపై ఆసక్తి ఉన్నవారు టీవీల్లో ఫార్ములావన్ (ఎఫ్1) పోటీలను తిలకిస్తూనే ఉంటారు. అయితే ఎఫ్1 అంత రేంజ్‌లో కాకపోయినా ప్రపంచస్థాయి ఈవెంట్‌గా మాత్రం ఫార్ములా-ఇ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. దేశంలోనే ముంబై, ఢిల్లీలాంటి మెగా నగరాలను కాదని మన హైదరాబాద్‌లో ఇలాంటి పోటీ జరగడం, దానిని చూసే అవకాశం రావడం సగటు అభిమాని దృష్టిలో పెద్ద విశేషం.

ఏమిటీ ఫార్ములా-ఇ..

పేరులోనే 'ఇ' ఉంటూ ఎలక్ట్రిక్ అంటూ స్పష్టంగా చెప్పేయడంతోనే దీని ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది. పెట్రోల్‌తో నడిచే ఫార్ములావన్ కార్లతో పోలిస్తే కాలుష్యరహితంగా, కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు తీసుకొచ్చిన కొత్త తరం కార్లు ఇవి. 2014లోనే ఫార్ములా-ఇ మొదలైనా.. దాని స్థాయి పెరిగి ప్రచారంలోకి వచ్చేందుకు కొంత సమయం పట్టింది. ఈసారి మరింత కొత్తగా, హంగులతో జనరేషన్ టెక్నాలజీ కార్లు రేసింగ్‌లో పాల్గొనబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగంపై ప్రచారం కల్పించేందుకు కూడా ఈ ఈవెంట్ ద్వారా ప్రయత్నిస్తున్నారు.

సాగర్ వద్దే ఎందుకు..

అయిన ఒక టూరిజం కేంద్రానికి చేరువలో 'స్ట్రీట్ సర్క్యూట్' పేరుతో ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. సరిగ్గా హైదరాబాద్‌లో కూడా అదే జరిగింది. ఫార్ములా వన్‌లలో ఉండే ప్రత్యేక ట్రాక్ కాకుండా రేస్ ముగిసిపోగానే స్ట్రీట్ సర్క్యూట్‌ను మళ్లీ మామూలుగా వాడుకోవచ్చు. ఎక్కువ మంది అభిమానులకు నగరం నడిబొడ్డున వినోదం అందించడమే ఈ రేస్‌ల లక్ష్యం.

సర్క్యూట్ ఎలా ఉంది..

మేర ట్రాక్ ఉంది. ఇందులో 18 మలుపులు రేస్‌ను ఆసక్తికరంగా మారుస్తాయి. బ్రేక్‌ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే బ్రేక్‌లు వాడటం వల్లే ఈ కార్లతో 40 శాతం వరకు ఎనర్జీ ఉత్పత్తి అవుతుంది. ఈ 'రీ ఎనర్జీ'తోనే కారు మరింతగా దూసుకుపోతుంది.

భారతీయులు ఉన్నారా?

చెందిన డ్రైవర్లు ఎవరూ పాల్గొనడం లేదు. అయితే భారత్‌కు చెందిన 'మహీంద్రా' రేసింగ్ టీమ్ మాత్రం ఉంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లు విదేశీయులే కాగా, రిజర్వ్ డ్రైవర్‌గా భారత్‌కు చెందిన జెహాన్ దారువాలా ఉన్నాడు. మరో వైపు జాగ్వార్ టీమ్‌కు భారత్ చెందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. కాబట్టి అభిమానులు ఏదైనా జట్టును 'సొంతం' చేసుకుంటే ఈ వినోదాన్ని మరింతగా ఆస్వాదించవచ్చు.

- ఫార్ములా-ఇ పోటీలకు ఆతిథ్యమిస్తున్న 30వ నగరం హైదరాబాద్
- వరకు 8 సీజన్‌లు జరిగాయి. ప్రస్తుతం జరుగుతోంది 9వ సీజన్.

హైలైట్స్

- రోడ్డులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌ను సిద్ధం చేయడంతో పాటు పోటీల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.
- 20 వేల మందికి పైగా వీక్షించేందుకు అనువైన పెద్ద గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భారీ స్క్రీన్‌లను సిద్ధంచేశారు.
- నాటి పోటీలకు సన్నాహకంగా శుక్రవారం నిర్వహించిన ప్రాక్టీస్ రన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా తెలుగుతల్లి ఫ్లై ఓవర్, లక్డీకాపూల్ మార్గంలో వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో కొన్ని వాహనాలు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ట్రయల్స్ నిర్వహణకు ఆటంకం కలిగినట్లు తెలిసింది.
- మరోవైపు ట్రయల్స్ ఆరంభంతోనే రేసింగ్ డ్రైవర్‌లు హోరెత్తించారు. అపరిమితమైన వేగంతో వాహనాలను పరుగులు పెట్టించి సందర్శకులను హుషారెత్తించారు.

నేటి షెడ్యూల్

ఉ.గం.8.05 – 8.55 (ఫ్రీ ప్రాక్టీస్ రేస్–2) 10.40–11.55 (క్వాలిఫయింగ్) మ.3.03 – 4.30 (ప్రధాన రేస్) టీవీలో క్వాలిఫయింగ్, ప్రధాన రేస్ ప్రత్యక్ష ప్రసారం: స్టార్ స్పోర్ట్స్ సెలక్ట్–2, డిస్నీ హాట్‌స్టార్ యాప్

- ఈ పోటీలను ట్రయల్ రన్‌గా నిర్వహించినప్పటికీ వీక్షించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు.
- ట్రయల్ రన్స్ తుదిదశకు చేరుకున్న తరువాత ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్‌పై దూసుకెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రయల్స్‌ను నిలిపివేశారు. క్రేన్ సాయంతో కారును అక్కడి నుంచి తరలించారు.

ప్రముఖుల సందడి

ట్రయల్ రన్స్‌ను వీక్షించేందుకు నగరానికి చెందిన మోటార్‌స్పోర్ట్స్ ప్రియులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వీఐపీ గ్యాలరీలు సందడిగా కనిపించాయి. ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతి, మహేశ్‌బాబు భార్య నమ్రత శిరోద్కర్, తెలుగుదేశం నాయకుడు లోకేష్ భార్య బ్రాహ్మణితో పాటు వారి పిల్లలు ఈ ట్రయల్ రన్ సందర్భంగా సందడి చేశారు.



జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి



మన జెండాతో విదేశీయులు





మహేశ్‌బాబు సతీమణి నమ్రత, కుమారుడు గౌతమ్

రాష్ట్రంలో రాక్షస పాలన

- బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భరత్‌గౌడ్



మాట్లాడుతున్న భరత్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాక్షస పాలన సాగిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ విమర్శించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్దలో శుక్రవారం 'ప్రజాగోస.. బీజేపీ భరోసా' నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే దళితుడిని తొలి ముఖ్యమంత్రిని చేస్తానని నమ్మబలికిన కేసీఆర్ సీఎం పీఠంపై తానే కూర్చున్నాడని ఆరోపించారు. భూమిలేని దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, ఇంటికో ఉద్యోగంవంటి అనేక హామీలు తుంగలో తొక్కారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నేటి వరకు అమలుకు నోచుకోలేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంటే బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి బాధిత తెలంగాణగా మార్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రభారి శివరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని, కేంద్రంలో మోదీ సుపరి పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిల్లి బాబు, రాఘవేందర్, యాదగిరి, శ్రీవర్ధన్‌రెడ్డి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, దేపల్లి అశోక్‌గౌడ్, అందె బాబయ్య, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, అశోక్, పాండురంగారెడ్డి, మోహన్‌సింగ్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్‌నాయక్, వెంకటేశ్ యాదవ్, ఎంకనోళ్ల వెంకటేశ్, కుర్మయ్య, నాగరాజుచారి, నర్సింలు, నర్సింహయాదవ్, శ్రీనివాస్, భరత్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా



వలంటీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: ఉన్నత చదువులు చదువుకుని ఉపాధి లేక, ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం స్వచ్ఛంద కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియం వేదికగా వందలాది కంపెనీలతో జాబ్‌మేళా ఏర్పాటు చేశామని, శనివారం ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు తీసుకుని వెంటనే ఇంటర్వ్యూలు తీసుకుంటారని, అక్కడికక్కడే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారని తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఈ జాబ్‌మేళా ఓ దిక్సూచిలా నిలుస్తుందని వివరించారు. రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకు జీతం వచ్చే ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు 130 ప్రముఖ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, 25 వేలమంది అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. వారందరికీ సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. జాబ్ మేళాకు వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సహకరించాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించామని, మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. వివరాలకు 72860 08234, 95054 37112, 82477 68371 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ సర్టిఫికెట్ల దందా గుట్టు రట్టు

- భూదాన్ బోర్డు పేరుతో మోసం
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎస్‌ఓటీ పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శేఖర్



స్వాధీనం చేసుకున్న కంప్యూటర్, సర్టిఫికెట్లు

ఇబ్రహీంపట్నం: భూదాన్ బోర్డు పేరుతో నకిలీ భూ సర్టిఫికెట్ల దందా చేస్తున్న ఇద్దరిని ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్నరావుల శ్రీశైలం(38)కు స్థానిక మంచాల రోడ్డులో మటన్ షాపు నడిపే రవితో రెండేళ్ల నుంచి పరిచయం ఉంది. ఆ పరిచయంతో రూ.లక్ష ఇస్తే భూదాన్ బోర్డు నుంచి 5 ఎకరాల భూమిని సైదాబాద్ కంచె సర్వేనంబర్ 58లో ఇప్పిస్తానని రవి భార్య లావణ్యకు నమ్మబలికాడు. భూ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో రూ.50 వేలు, పాసుబుక్ ఇచ్చేటప్పుడు మరో రూ.50 వేలు ఇవ్వాలని చెప్పాడు. అతని మాటలు నమ్మి లావణ్య తన ఆధార్‌కార్డు, రూ.50 వేల నగదు ఇచ్చింది. యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన ఎట్టి లింగమయ్య (31) ఇబ్రహీంపట్నంలో శ్రీకృష్ణ జిరాక్స్, ఇంటర్నెట్ షాపు నడుపుతున్నాడు. ఒక ఫోర్జరీ సర్టిఫికెట్‌కు రూ.5 వేలు ఇస్తానని లింగమయ్యతో శ్రీశైలం కుమ్మక్కయ్యాడు. సెప్టెంబర్ 2016లో 5 ఎకరాల భూదాన్ బోర్డు భూమి లావణ్యకు ఇచ్చినట్లుగా ఫోర్జరీ సర్టిఫికెట్ సృష్టించి ఇచ్చాడు. ఆదిబట్లకు చెందిన టింగ్లికార్ స్వప్న, కుర్మల్‌గూడకు చెందిన కొయల్‌కార్ అనిత, బడంగ్‌పేట్‌కు చెందిన బండ బాలమణి, మీర్‌పేట్‌కు చెందిన చంద్రశేఖర్‌ను సైతం శ్రీశైలం, లింగమయ్య కలిసి మోసం చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా పాసుబుక్స్ ఇవ్వలేదు. పలుమార్లు ఫోన్లు చేసినా స్పందన లేకపోవడంతో బాధితులకు అనుమానం కలిగి పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలోని శ్రీకృష్ణ ఇంటర్నెట్ షాప్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి నకిలీ సర్టిఫికెట్లు, కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీశైలం, లింగమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నంతోపాటు ఆదిబట్ల, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్లలో నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

- జూనియర్ విభాగంలో విజేతగా గౌతమ్ జూనియర్ కాలేజ్
- సీనియర్స్ విభాగంలో విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్
- 17 రీజినల్ ఫైనల్స్

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP


భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు

పోచారం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో కొనసాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు శుక్రవారం సెమీ ఫైనల్స్‌తో పాటు ఫైనల్స్ సందడిగా సాగాయి.

విజేతల వివరాలు..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

◆ జూనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భవన్స్ శ్రీఅరవిందో జూనియర్ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 79 రన్స్ తీసి ఓటమి పాలైంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల స్థాయి జూనియర్ విభాగంలో గౌతమ్ జూనియర్ కాలేజ్ జట్టు విజేతగా నిలిచింది.

◆ సీనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎమ్‌ఎల్‌ఆర్‌ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల కోల్పోయి 82 రన్స్ మాత్రమే చేయడంతో వేద డిగ్రీ కాలేజ్ విజయం సాధించింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 2

◆ సీనియర్స్ విభాగం రెండో సెమీ ఫైనల్స్‌లో ఎస్‌పీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 116 పరుగులు తీసింది. ఈ జట్టుతో తలపడిన భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్ల కోల్పోయి 117 పరుగులు తీసి విజయం చేజిక్కించుకుంది. ఈ సెమీ ఫైనల్స్‌లో భవన్స్ జట్టు నుంచి జగదీష్ 27 బంతుల్లో 66 పరుగులు చేశాడు. మరో క్రీడాకారుడు క్రిస్టిక్ 26 బంతుల్లో 49 రన్స్ చేశాడు.

◆ సీనియర్స్ విభాగం ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వేద డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 72 రన్స్ చేసింది. వీరితో బ్యాటింగ్ చేసిన భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టు 1 వికెట్ కోల్పోయి 73 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. భవన్స్ జట్టు సభ్యుడు నితీష్ 8 బాల్స్‌లో 27 రన్స్ తీసి ప్రతిభ చాటాడు. జగదీష్ 15 బంతుల్లో 22 రన్స్ సాధించాడు. సీనియర్ విభాగంలో హైదరాబాద్ జిల్లా విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల సైనిక్‌పురి నిలిచింది.

◆ ఈ నెల 17న ఇదే మైదానంలో రీజినల్ ఫైనల్స్ నిర్వహించనున్నారు.


గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు

నవీన్‌రెడ్డిపై పీడీ యాక్ట్

వైద్యవిద్యార్థిని వైశాలిరెడ్డి కిడ్నాప్ కేసు


నవీన్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: సంచలనం సృష్టించిన వైద్య విద్యార్థిని వైశాలిరెడ్డి ఇంటిపై దాడి, కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు నవీన్‌రెడ్డిపై పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో నివాసం ఉండే వైద్య విద్యార్థి వైశాలిరెడ్డి ఇంటిపై ఇటీవల 60 మందితో వచ్చి దాడి చేసి, ఆమెను అపహరించిన కేసులో ప్రధాన నిందితుడైన మిస్టర్ టీ ఎండీ కొడుదుల నవీన్‌రెడ్డి ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్నాడు. గతంలో ఇతనిపై బీడీఎస్ విద్యార్థినిని వేధించడం, ఫేక్ ఇన్‌స్ట్రాగాం తయారు చేసి ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసుతో పాటు మరో ఐదు కేసులు ఉన్నాయి. తాజాగా రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు పీడీయాక్ట్ నమోదు చేశారు. కాగా, పీడీ యాక్ట్ కేసు నమోదు కావడంతో నవీన్‌రెడ్డి మరో మూడు నెలల పాటు బెయిల్ దొరకడం కష్టమేనని న్యాయనిపుణులు చెబుతున్నారు.

క్యాబ్ డ్రైవర్ అదృశ్యం


రాములు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: క్యాబ్ డ్రైవర్ అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జావీజీ రాములు(48) అనే వ్యక్తి క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరి ఈ నెల 7న కారు తీసుకొని వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు. తన కూతురు ఫోన్ చేసినా స్పందన లేకపోడంతో, చుట్టు పక్కల, బంధువుల దగ్గర అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణపల్లిలో ప్రకృతి వనం దగ్ధం


కాలిపోయిన ప్రకృతి వనంలోని మొక్కలు

మాడ్గుల: మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పల్లె ప్రకృతి వనం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు సర్పంచ్ పులికంటి లక్ష్మయ్య తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనంలో చెట్లు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతుంటే ఓర్వలేని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మొక్కలు అగ్నికి పూర్తిగా కాలిపోయాయని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

నగలు తయారుచేస్తానని బంగారంతో పరార్

- ఇబ్రహీంపట్నంలో పట్టుకున్న బాధితులు
- పోలీసులకు అప్పగింత

యాచారం: నగలు తయారు చేస్తానని వెండి, బంగారంతో పరారైన ఓ వ్యాపారిని బాధితులే పోలీసులకు పట్టించారు. యాచారం సీఐ లింగయ్య తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామానికి చెందిన భూషణచారి యాచారం మండల పరిధి తక్కళ్లపల్లిలోని సిద్ధగోని యాదమ్మ ఇంట్లో నగల తయారీ దుకాణం నిర్వహిస్తున్నారు. ప్రారంభంలో గ్రామస్తులకు నగలు తయారు చేసి త్వరగా ఇవ్వడంతో ప్రజల్లో విశ్వాసం కలిగింది. దీంతో పలువురు మహిళలు అరతులం బంగారం, దాదాపు 150 తులాల వెండిని నగల తయారీ కోసం భూషణాచారికి ఇచ్చారు. బంగారం, వెండి తీసుకున్న భూషణాచారి వారం రోజులుగా దుకాణం తెరవడం లేదు. అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్కళ్లపల్లి గ్రామస్తులు గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నంకు వెళ్లారు. భూషణాచారి మోహానికి మాస్కు పెట్టుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు. పసిగట్టిన గ్రామస్తులు వెంటనే 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులకు భూషణాచారిని అదుపులోకి తీసుకుని యాచారం పోలీసులకు అప్పగించారు. విచారించిన పోలీసులు శుక్రవారం భూషణాచారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బొక్కల కంపెనీని మూసివేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మంచిరెడ్డి ప్రస్తావన
- కొత్తపల్లి వాసుల అభినందనలు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కొత్తపల్లి గ్రామంలో ఉన్న బొక్కల కంపెనీపై శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. కంపెనీని తక్షణం మూసివేతకు ఆదేశాలివ్వాలని కోరారు. ఐదేళ్లుగా పశువుల కళేబరాలు, ఎముకలు, మాంస ముద్దలతో నూనెను తయారు చేస్తున్నారు. ఆగ్రో ఫీడ్ కంపెనీ పేరుతో నూనెను తయారు చేస్తుండడం వల్ల కొత్తపల్లితో పాటు తక్కళ్లపల్లి, కిషన్‌పల్లి, తమ్మలోనిగూడ. మాల్, తక్కళ్లపల్లి తండా తదితర గ్రామాల్లోని ప్రజలకు తీవ్ర దుర్వాసన వస్తుంది. ఐదేళ్లుగా ప్రజలు వ్యతిరేకిస్తున్నా పెద్దల అండదండలతో కంపెనీని నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్తపల్లి గ్రామస్తులు కంపెనీకి వెళ్లే దారిలో నిరాహార దీక్ష చేపట్టారు. ధర్నాలు, ఆందోళన, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నారు. కొత్తపల్లి గ్రామస్తులు బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తన ప్రగతి నివేదన పాదయాత్ర గ్రామానికి వచ్చినప్పుడు బొక్కల కంపెనీ మూసివేతపై ఫిర్యాదు చేశారు. కొత్తపల్లి ప్రజల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అసెంబ్లీలో బొక్కల కంపెనీ మూసి వేతపై అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో బొక్కల కంపెనీ మూత పడే అవకాశం ఉందని సంతోషపడుతున్నారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం


అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

యాచారం: మహనీయుల ఆశయాల సాధనకు బడుగు, బలహీనవర్గాలు కృషి చేయాలని ఉస్మానియా ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో గురువారం రాత్రి అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లు ఏ మతానికో.. కులానికో చెందిన వారు కానే కాదన్నారు. దేశంలో ఉన్న బడుగు, బలహీనవర్గాలు, దళితుల దేవుళ్లు అని అన్నారు. వారి కృషి ఫలితంగానే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా చైతన్యవంతులుగా మారుతున్నారని అన్నారు. నేటికి ఇంకా వెనుకబడిన వర్గాలను అణచి వేయడానికి కుట్రలు జరుగుతున్నాయని, గ్రహించి చైతన్యం కాకపోతే ఎంతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. మహనీయులు జీవిత చరిత్రలు చదవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన దళితులు తమ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

వ్యక్తులను గౌరవించండి

తమ కులాల్లోని వ్యక్తులను గౌరవించడం నేర్చుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య దళిత సోదరులకు సూచించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల ఏం చెప్పారో తెలుసుకోవాలని, తన తోటి కులాల వారిని గౌరవించుకుంటూ, తమపై పెత్తనం చెలాయించే అగ్రకులాలపై తిరగబడాలని చెప్పినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండిమీద కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గౌడుకొండ్ల ప్రవీణ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు కట్టెల కృష్ణ, అంబేడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం రాజశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేష్, జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, గాంధీ ఆస్పత్రి వైద్యుడు అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

శంకర్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాల పరిసరాలల్లో ముగ్గురు అనుమానితులు బైక్‌పై వచ్చి విద్యార్థులకు గంజాయి ప్యాకెట్‌లను విక్రయిస్తున్నారు. కళాశాల వద్ద వాహనాల తనిఖీలు నిర్వస్తుండగా వీరు పట్టుబడ్డారు. నిందితులు అల్లుకుంట్ల అయ్యప్ప, మహ్మద్ నవాజ్, రాపోల్ ఉదయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలకుంట తండా సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ శెట్టి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నరేవెల్లికి చెందిన అనిల్ అనే యువకుడు మైసిగండి నుంచి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో అటవీ ప్రాంతం వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో అనిల్‌తో పాటు, మరో బైక్‌పై వస్తున్న కృష్ణయ్య గాయపడ్డారు. గాయపడ్డవారిని వివిధ ఆస్పత్రులకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.